"అదేమిటి? రాయకుండానే?" తెల్లబోతూ అడిగాడో విద్యార్థి.

"అవును. ఇవాళ మీకు పెట్టిన పరీక్ష కాగితాల మీద కాదు. దారిలోని దాహంగొన్న వాడికి సహాయం చేయలేని మీరు ఎన్ని నీతికథలు చదివి ఏం ప్రయోజనం?"

అదంతా ఆ ప్రొఫెసర్ ఆడిన నాటకం అని విద్యార్థులంతా గ్రహించి తమ ప్రవర్తనకి సిగ్గుపడ్డారు.

## 117. శాకాహారం

ఓ హిందూ గురువు లాస్ ఏంజెలెస్ లోని ఓ ఆశ్రమంలోని అమెరికన్ శిష్యులకి శాకాహారం తినడం ఆధ్యాత్మిక ప్రగతికి ముఖ్యమని చెప్తున్నాడు.

వెంటనే ఓ అమెరికన్ లేచి అడిగాడు.

"మీరు నిజంగా శాకాహారేనా?"

"అవును." జవాబిచ్చాడు గురువు.

"మీరు ఆవు నించి వచ్చిన పాలు తాగుతే తప్పు కానిది, మరి మేం ఆవు నించి వచ్చిన మాంసాన్ని తింటే తప్పేమిటి?" ప్రశ్నించాడు అతను.

"నువ్వు మీ అమ్మ నించి వచ్చిన పాలు తాగగా తప్పు లేనిది, మీ అమ్మ మాంసాన్ని తింటే కూడా తప్పు లేకపోతే, అప్పుడు నువ్వు చెప్పిందాంట్లో కూడా తప్పు లేదు."

ఆ అమెరికన్ నించి జవాబు లేదు.

"అందుకే మేము గోవుని మాతగా భావించి, దాని మాంసాన్ని తినం." జవాబు చెప్పాడు గురువు.

## 118. ఆనంద మార్గం

"స్వామీ. ఎప్పుడూ ఆనందంగా వుండాలంటే ఏం చెయ్యాలి?" ఒకరు ఓ యోగిని అడిగారు.